నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 4 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## డివైడర్ల మధ్యలో పెంచిన చెట్లు నరికివేత

● మూడున్నర అడుగుల ఎత్తులో గుబురుగా పెంచాలని నిర్ణయం



మంచిర్యాలలోని కాలేజీ రోడ్డులో నరికిన చెట్లు

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 3 : పట్టణంలోని ప్రధాన రహదారులపై డివైడర్ల మధ్యలో ఏపుగా పెరిగిన చెట్లను మున్సిపల్ సిబ్బంది నరికివేస్తున్నారు. కేసీఆర్ సర్కారులో హరితహారం కార్యక్రమంలో భాగంగా కాలేజీరోడ్‌లో ఓవర్‌బ్రిడ్జి నుంచి గోదావరి వరకు మొక్కలు నాటగా ఏపుగా పెరిగాయి. పట్టణ సుందరీకరణ పనుల్లో భాగంగా రోడ్లపై ఏపుగా పెరిగిన చెట్లను అడుగున్నర వరకు నరికివేస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ మొదళ్ల నుంచి వచ్చే ఆకులు, కొమ్మలను గుబురుగా మూడున్నర అడుగుల ఎత్తు వరకే పెంచేలా చర్యలు చేపట్టనున్నారు. పట్టణంలోని డివైడర్ల మధ్య పెరిగిన అన్ని చెట్లను అడుగున్నర వరకు కొట్టివేస్తామని, కొత్తగా వచ్చే కొమ్మలు, ఆకులను గ్రూమింగ్ చేసి అందంగా తీర్చిదిద్దుతామని ఇంజినీర్ మసూద్ అలీ తెలిపారు.

### ❖ బ్యాంకుల చుట్టూ తిరిగిన



లింగాపూర్, డిసెంబర్ 3 : మా ఊరిలో నాకు మూడెకరాల భూమి ఉంది. దాని మీద రూ. 2.13 లక్షల రుణం తీసుకున్న. యేటా రెన్యూవల్ చేస్తున్న. రుణమాఫీ చేస్తరని ఎంతో ఆశతో ఎదురు చూసిన. ఇప్పటి వరకు కాలే. బ్యాంకుల చుట్టూ తిరిగి తిరిగి యాష్టకు వచ్చిన. అన్ని అర్హతలున్నా రుణ మాఫీ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా రైతులను గోస పెట్టుకునుడు మంచిది కాదు. ఇకనైనా న్యాయం చేయాలె.

**- చవాన్ సోరాజీ, గోపాల్‌పూర్**

### ❖ సాకులు చెప్పడం సరికాదు



తిర్యాణి, అక్టోబర్ 3 : మా ఊరిలో నా పేరున ఐదెకరాలు, నా భార్య పేరు మీద రెండెకరాల భూమి ఉంది. నేను రూ. 2 లక్షలు, నా భార్య రూ. లక్ష రుణం తీసుకున్నం. ఇప్పటి వరకు రుణం మాఫీ కాలే. కేసీఆర్ సర్కారు చెప్పినట్లుగానే రైతులందరికీ రుణాలు మాఫీ చేసింది. కానీ కాంగ్రెసోళ్లు ఇట్లా గోస పెట్టుడు మంచిది కాదు. ఎన్నికలప్పుడేమో రుణాలన్నీ మాఫీ చేస్తమని చెప్పిన్రు. ఇప్పుడు గద్దెనెక్కిన తర్వాత ఇలా సాకులు చెప్పడం సరికాదు. కష్టకాలంలో ఉన్నం. మాకు రుణాలు మాఫీ చేసి ఆదుకోవలి.

**- వెడ్మ భగవంతరావు, రైతు, కన్నేపల్లి**

# రిక్తహస్తం



## కుటుంబ నిర్ధారణ సర్వే చేసినా
## సగం మందికి కాని రుణమాఫీ

● అన్ని అర్హతలున్నా రాని వైనం ● ఉమ్మడి జిల్లాలో వేలాది మంది ఎదురుచూపులు
● సాకులు చెప్పి మోసం చేశారంటూ అన్నదాతల ఆవేదన ● న్యాయం చేయాలని వేడుకోలు

మంచిర్యాల, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామంటూ చెప్పుకొచ్చిన సర్కారు.. చివరకు అనేక మంది కర్షకులకు రిక్త'హస్తం'చూపించింది. రేషన్ కార్డులు లేవని.. రుణం ఎక్కువ ఉందని.. ఇలా ఏవేవో కారణాలు చెప్పి.. సర్వే చేపట్టి కాలయాపన చేసింది. ఇక చివరకు రుణమాఫీ 100 శాతం పూర్తయ్యిందని చేతులెత్తేసింది. అన్ని అర్హతలున్నా తమకు రుణం మాఫీ కాలేదని.. ప్రభుత్వం తమను మోసం చేసిందంటూ రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది.

కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే విడుతల వారీగా రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పుకొచ్చింది. ఈ క్రమంలో ఆగస్టులో మూడో విడుత విడుదల చేసింది. ఇందులో అనేక మంది అర్హులకు రుణమాఫీ కాకపోవడంతో వారంతా ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. దీంతో స్పందించిన సర్కారు రేషన్ కార్డు లేని వారికి. రూ. రెండు లక్షల కంటే ఎక్కువ ఉన్నవారికి రుణం మాఫీ కాలేదని.. రూ. రెండు లక్షలకు పైగా రుణం ఉన్న వారు... మిగతా డబ్బు కట్టాలని స్పష్టం చేసింది. ఆపై రేషన్ కార్డులు లేని వారి కోసమంటూ కుటుంబ నిర్ధారణ సర్వే మొదలు పెట్టింది. మూడు నెలల పాటు కాలయాపన చేసింది. ఇక చివరకు ఇటీవల నాలుగో విడుత రుణమాఫీ (100 శాతం) పూర్తయ్యిందని ప్రకటించింది. అన్ని అర్హతలున్నా తమకు రుణమాఫీ కాలేదని.. సర్వే పేరిట సర్కారు తమను మోసం చేసిందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### సర్వే చేసినా సగం మందికి రాలే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రేషన్ కార్డు (కుటుంబ నిర్ధారణ) లేక వేలాది మంది రైతులకు రుణమాఫీ కాలేదు. ఆదిలాబాద్ జిల్లాలో 18,000, నిర్మల్ జిల్లాలో 13,433 మంది రైతులు, మంచిర్యాల జిల్లాలో 15,542 మంది రైతులకు కుటుంబ నిర్ధారణ లేక రుణమాఫీ కాలేదు. కాగా, ఆదిలాబాద్ జిల్లాలో 6,600 మందికి, నిర్మల్ జిల్లాలో 6,823 మందికి, మంచిర్యాల జిల్లాలో 8,195 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయ్యింది. అంటే ఈ లెక్కన రుణమాఫీ అవుతుందని ఆశపడి, రైతు వేదికల చుట్టూ, గ్రామ పంచాయతీల చుట్టూ తిరిగి మరీ సర్వే చేయించుకున్న సగం మందికి కూడా రుణమాఫీ కాలేదు. అలాంటప్పుడు సర్వే ఎందుకు చేశారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. రేషన్ కార్డు లేదనే కారణంతో నాలుగో విడుత పూర్తయ్యాక కూడా రుణమాఫీ కాని రైతులు ఎంతో మంది ఉన్నారని వాపోతున్నారు. రూ.రెండు లక్షల లోపు రుణం ఉండాలని చెప్పడంతో.. అంతకు మించి ఉన్న రైతులు ఆ డబ్బు కట్టినా కూడా రుణమాఫీ కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

### కారణాలెన్నో..

సర్వేలో పాల్గొన్న కుటుంబాలకు రుణమాఫీ ఎందుకు కాలేదంటే అధికారులు ఎన్నో కారణాలు చెబుతున్నారు. ''రేషన్ కార్డు లేని రైతులు కుటుంబాలపై సర్వే చేశాం. ఆధార్‌కార్డు నంబర్ల ఆధారంగా వివరాలు తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. రేషన్‌కార్డులో ఉన్న తప్పులు కాకుండా బ్యాంక్ పాస్‌బుక్‌లలో ఉన్న తప్పులను బ్యాంక్ వాళ్లే సరిచేశారు. అలాంటి వారికి రుణమాఫీ అయ్యింది. సర్వేలో పాల్గొన్నక కూడా రుణమాఫీ కాలేదంటే కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎవరో ఆ కుటుంబాలోఉండి ఉండాలి. లేదా రూ. రెండు లక్షల కంటే ఎక్కువ రుణం ఉండి ఉండాలి. ఈ రెండు కాకపోతే లోన్ రెన్యూవల్ చేయక మూడేళ్లు దాటి ఉండాలి. ఇలాంటి రైతులకే రుణమాఫీ కాలేదు' అని అధికారులు అంటున్నారు. మరి అన్ని అర్హతలు ఉండీ మాఫీ కాని వారు ఏం చేయాలి అంటే మాత్రం అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావడం లేదు. ఈ నేపథ్యంలో రుణమాఫీ కాని రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. అన్ని అర్హతలు ఉన్నా మాఫీ కాలేదంటూ గోడు వెల్లబోసుకుంటున్నారు.

### ❖ వడ్డీ, ఆసలు కట్టినా లోన్ మాఫీ కాలేదు



నెన్నెల, డిసెంబర్ 3 : నాకు మా ఊరిలో ఉన్న భూమి మీద ఆవుడం తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో రూ.1.90 లక్షల రుణం తీసుకున్న. వడ్డీతో కలిపి రూ.2.15 లక్షలు అయ్యింది. వడ్డీతో పాటు కొంత అసలు కలిపి రూ.25 వేలు కట్టాను. ఇగ బ్యాంక్‌లో రూ.2 లక్షల లోపు పంట రుణమే ఉంది. కానీ నాలుగో విడుతలో కూడా నాకు రుణమాఫీ కాలే. మా కుటుంబ సభ్యుల్లో ఎవ్వరికి కూడా పంట రుణం లేదు. నాకు రేషన్ కార్డు కూడా ఉంది. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ఇట్లా మాట తప్పి మోసం చేయడం సరికాదు.

**- చిలారపు సంతోష్, చిత్తాపూర్**

## రోజూ 2.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలి

● 16 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీయాలి
● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎండీ బలరామ్

శ్రీరాంపూర్, డిసెంబర్ 3 : పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రోజూ 2.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి.. ఎప్పటికప్పుడు రవాణా చేయాలని సీఎండీ ఎన్ బలరామ్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని ఏరియాల జీఎంలతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి సాధనకు వీలుగా రోజుకు 16 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్(మట్టి) తొలగించాలన్నారు. ఉత్పత్తి లక్ష్య సాధనకు అన్ని ఏరియాలు సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి 8 గంటల పాటు పనిచేసేలా చూడాలని, క్రమ శిక్షణ పాటించకుంటే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంపెనీ యంత్రాల పనితీరును మెరుగుపరచాలని, కనీసం 18 గంటలు వినియోగించేలా చూడాలన్నారు. నూతన ప్రాజెక్టులైన కొత్తగూడెంలోని వీకే ఓసీపీ, ఇల్లందులోని రొంపేడు ఓసీపీలో వచ్చే మూడు నెలల్లో ఉత్పత్తి ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. ఒడిశా నైనీ బ్లాక్ చెట్ల గణన కొంత పూర్తయిన నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తితో ముడిపడిన ఇతర కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు, వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం కో ఆర్డినేసన్ సుభానీ, శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ పాల్గొన్నారు.



బెల్లంపల్లి : గురుకుల పాఠశాల బయట నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

# గురుకులాలేమైనా జైళ్లా..?

● లోనికి వెళ్లకుండా తాళాలు వేయించడం సిగ్గుమాలిన చర్య
● రేవంత్ 48 మందిని పొట్టనబెట్టుకున్నడు
● బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్
● రేగులగూడ ఆశ్రమ పాఠశాల సందర్శన
● అడ్డుకోవడంపై ధర్నా

కాసిపేట, డిసెంబర్ 3 : 'గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల సందర్శనకు వెళ్తే అడ్డుకుంటున్నారు. అవి ఏమైనా జైళ్లా అంటూ బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ రేవంత్‌రెడ్డి సర్కారుపై మండిపడ్డారు. మంగళవారం రేగులగూడ ఆశ్రమ పాఠశాల సందర్శనకు నాయకులతో కలిసి వెళ్లగా, హెచ్‌ఎం, సిబ్బంది లోపలికి రాకుండా తాళాలు వేయించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల గేటు ముందు ధర్నా చేశారు. నిరసన తెలిపారు. సర్కారుది సిగ్గుమాలిన చర్య అంటూ ఫైర్ అయ్యారు. నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులను పోలీసులు నిలువరించారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గురుకులాలను ఎంతో అభివృద్ధి చేసి సకల సౌకర్యాలు కల్పించారని, కానీ రేవంత్‌రెడ్డి సర్కారులో విద్యార్థులు ఫుడ్ పాయిజన్లతో విలవిల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్బంధించిన మాత్రాన పోరాటం ఆగదని, రేవంత్ చేసే పాపాలను ప్రజలకు వివరించి చెబుతామన్నారు. రాష్ట్రంలో 48 మంది విద్యార్థులను పొట్టన బెట్టుకున్న దుర్మార్గుడు సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు అరుణ్, మండల అధ్యక్షుడు మారం మహేందర్ యాదవ్, మాజీ సర్పంచ్ ఆడే బాదు, మాజీ ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బోయిని తిరుపతి యాదవ్, మాజీ ఉప సర్పంచ్ సుమన్, నాయకులు వేటెల్లి నరేశ్ యాదవ్, కైలాష్, పవన్ కల్యాణ్, రోషణ్, సాయికుమార్, హర్షవర్ధన్, కార్తీక్ పాల్గొన్నారు.

### గురుకుల బాట అంటే కాంగ్రెస్‌కు భయం

బెల్లంపల్లి, డిసెంబర్ 3 : గురుకుల బాట అంటేనే కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకుందని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ పేర్కొన్నారు. మంగళవారం బెల్లంపల్లిలోని తెలంగాణ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల/కళాశాల సందర్శనకు వెళ్లగా సిబ్బంది లోనికి వెళ్లకుండా గేట్‌కు తాళం వేయడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోపలికి వెళ్లకుండా తాళాలు వేయించడం సిగ్గుమాలిన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్, రోషణ్, సాయికుమార్, హర్షవర్ధన్, కార్తీక్ పాల్గొన్నారు.



కాసిపేట : రేగులగూడ ఆశ్రమ పాఠశాలకు తాళం వేయడంతో గేటు ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

## అడ్డుకోవడం వెనుక ఆంతర్యమేమిటో?

● గురుకులాల్లో సదుపాయాలు కల్పించడంలో సర్కారు విఫలం
● విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలి
● బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు చెన్నమల్ల చైతన్య
● విద్యాలయాల్లోకి అనుమతినివ్వకపోవడంపై నాయకుల ఫైర్.. నిరసన



గుడిపేటలోని మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

హాజీపూర్, డిసెంబర్ 3 : గురుకులాల బాటను అడ్డుకోవడం వెనుక ఆంతర్యమేమిటో చెప్పాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు చెన్నమల్ల చైతన్య డిమాండ్ చేశారు. మంగళవారం గుడిపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే, ముల్కల్లలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలను సందర్శించేందుకు బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్వీ నాయకులతో వెళ్లారు. విద్యాలయాల్లోకి వెళ్లకుండా ప్రిన్సిపాళ్లు అడ్డుకోగా, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయాచోట్ల ప్రధాన ద్వారాల ముందు బైఠాయించి నిరసన తెలిపారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హాస్టళ్లలో మౌలిక సదుపాయాలను కల్పించడంలో సర్కారు విఫలమైందని, అందువల్లే గురుకులాల బాటను అడ్డుకుంటుందని ఆరోపించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా అనేక గురుకులాలను ఏర్పాటు చేసి సకల సౌకర్యాలు కల్పిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వ పట్టింపులేని తనం వల్ల అవి అధ్వానంగా మారాయన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని ఇప్పటికైనా విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు అఖిల్, సత్యం, హాజీపూర్ మండల మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గొల్ల శ్రీనివాస్, నాయకులు ఆసాది ప్రవీణ్, చెరుకు శ్రీనివాస్, బొద్దు రవి, బల్లెపు వినోద్ పాల్గొన్నారు.

● కాగజ్‌నగర్ అడవుల్లో 100 కెమెరాల ఏర్పాటు
● 35 ట్రాకర్స్ బృందాలతో అన్వేషణ

# పులి అలజడి

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): జిల్లాలో పులి అలజడి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నది. ముఖ్యంగా కాగజ్‌నగర్ డివిజన్‌లో నిత్యం ఏదో ఒక చోట పులి కనిపిస్తూనే ఉన్నది. ఇటీవల ఇద్దరిపై పులిదాడి చేసిన నేపథ్యంలో అటవీ అధికారులు దాని జాడను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇటిక్యాల్‌పాడ్ అటవీ ప్రాంతంలో 20 సీసీ కెమెరాలు, కాగజ్‌నగర్ డివిజన్‌లోని అటవీ ప్రాంతంలో 80 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మంగళవారం వాంకిడి మండల కేంద్రానికి సమీపంలో చేనులో పని చేస్తున్న శంకర్‌కు పులి గాండ్రింపులు వినపడగా, స్పృహ కోల్పోయాడని సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. రైతు శంకర్‌కు చెందిన పత్తి చేనులో పరిశీలించారు. పులి సంచరించిన ఆనవాళ్లు కనిపించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం సిర్పూర్-టీ మండలంలోని పెద్దబండ గ్రామంలోని రైస్ మిల్లు సమీపంలో ఉన్న పత్తి చేనులో పులి సంచరించడాన్ని వాహనదారులు చూసినట్లు తెలుస్తోంది. ఇటిక్యాలపాడ్, పెద్ద బండ గ్రామాల మధ్యలో పులిసంచారం ఎక్కువగా ఉన్నట్లుగా అధికారులు భావిస్తున్నారు. దహెగాం మండలం రాళ్లవాగు సమీపంలో జంటపులులు సంచరించినట్లు, వాగులో నీళ్లు తాగుతున్నట్లు సోషల్ మీడియాలో వదంతులు వ్యాపించాయి. జిల్లాలో పులులు సంచారాన్ని ఆసరగా చేసుకుంటున్న కొంత మంది సోషల్ మీడియాలో ఫేక్ వార్తలను వ్యాప్తి చేస్తూ ప్రజలను మరింత భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

### యానిమల్ ట్రాకర్స్‌తో జల్లెడ

కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో మనుషులపై, పశువులపై పులి దాడులు జరిగిన నేపథ్యంలో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 35 యానిమల్ ట్రాకర్స్ బృందాల(140 మంది)తో గాలింపులు చేపడుతున్నారు. ఓ వైపు డ్రోన్ కెమెరాలు, మరోవైపు ట్రాకర్స్, సీసీ కెమెరాలతో వెతుకుతున్నా పులి జాడను మాత్రం అధికారులు గుర్తించలేకపోతున్నారు. గతంలో పులిని పట్టుకునేందుకు బోన్‌లు ఏర్పాటు చేసిన అధికారులు ఈసారి మాత్రం ఆ ప్రయత్నం చేయడం లేదు. అటవీ సమీప ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో పులి సంచరిస్తుండడంతో రైతులు, రైతు కూలీలు గజగజ వణికిపోతున్నారు.



బెల్లంపల్లి : చిరుతపులి అడుగులను గుర్తిస్తున్న అటవీ సిబ్బంది



సిర్పూర్ మండలం పెద్దబండ అటవీ ప్రాంతంలోని చేనులో పులిసంచరిస్తుందని తెలియడంతో గుమిగూడిన వాహనదారులు



కాగజ్‌నగర్ అడవుల్లో పులి ఆచూకీకోసం అన్వేషిస్తున్న ట్రాకర్స్

### చర్లపల్లిలో చిరుత పులి సంచారం

బెల్లంపల్లి, డిసెంబర్ 3 : చర్లపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. మంగళవారం పులి అడుగులను చూసిన స్థానికుడు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్‌ఆర్వో పూర్ణచందర్ ఆధ్వర్యంలో అటవీ అధికారులు అక్కడికి వెళ్లి అడుగులను పరిశీలించి అది చిరుతపులి అడుగులే అని నిర్ధారించారు. చిరుత పులి ఎల్లారం, చర్లపల్లి గ్రామం మీదుగా కన్నెపల్లి, భీమిని మండలాలకు వెళ్లినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ప్రజలు అప్రమత్తం ఉండాలని హెచ్చరించారు.

